క్లుప్తంగా

రేపు బిజినెస్ మానిటరింగ్ కమిటీ సమావేశం

తెనాలి: తెనాలి మండల బిజినెస్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఈనెల 29న జరుగుతుందని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ జేఎస్ఎన్ మూర్తి తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు కమిటీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కమిటీ సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు.

స్వచ్ఛతే సేవలో మున్సిపల్ అధికారులు

తెనాలి: స్వచ్ఛత హి సేవా–2023 కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ అధికారులు పట్టణంలోని స్వాతంత్ర్యయోధుల విగ్రహాలను శుభ్రం చేశారు. ఆ మహనీయులు చేసిన పోరాటాలు, త్యాగాలను వివరించారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ పాటించాలన్న సందేశంతో కృషిచేసిన పూజ్య బాపూజీ ఆశయాలను స్మరించుకున్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఆకురాతి రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, వై.అనుపమ, షేక్ బాజిహుస్సేన్, జి.ప్రసాద్, ఎం.సుబ్బారావు, వై.లక్ష్మీనారాయణ, శానిటేషను కార్యదర్శులు ప్రవీణ్‌కుమార్, శ్రావణ్, యురియాపాల్, హావెలా ప్రియదర్శిని పాల్గొన్నారు.

4న సామూహిక ఎలుకల నిర్మూలన



తెనాలిటౌన్: రూరల్ మండల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల పరిధిలో అక్టోబరు 4వ తేదీన సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం చేపట్టినట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.ఉషారాణి తెలిపారు. రూరల్ మండలం మల్లెపాడులో బుధవారం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వ్యవసాయాధికారులు వరి పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. పొలంబడిలో ఏడీఏ పైరులో శత్రు, మిత్ర పురుగుల గురించి వివరించారు. పొలంబడి వల్ల ఉపయోగాలను తెలియజేసి, ప్రతి వారం పంటలను పరిశీలించాలని సూచించారు. సామూహిక ఎలుకల నిర్మూలనతో పంటల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. మండల వ్యవసాయాధికారి జి.ప్రేమసాగర్, ఆర్బీకే వీఏఏ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం పంపిణీ



తెనాలిటౌన్: రూరల్ మండలం అంగలకుదురు సజ్జనపేటలోని ఆర్‌సీఎం చర్చిలో బుధవారం పునీత విన్సెంట్‌పాల్ పండుగను జరిపారు. చర్చి ఫాదర్ రెవరెండ్ శౌరిరాజు ప్రత్యేక దివ్య బలిపూజ నిర్వహించి, ప్రార్థనలు చేశారు. బైబిల్ గ్రంథం నుంచి వాక్యోపదేశం చేశారు. అనంతరం వృద్ధులకు బియ్యం పంపిణీ చేశారు. సొసైటీ ప్రెసిడెంట్ బాలస్వామి, వైస్ ప్రెసిడెంట్ సామ్యేల్, పి.బాలస్వామి, రాజమోహన్, రవిబాబు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

తెనాలిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఈబీ అధికారులు అరెస్ట్ చేశారు. పట్టణంలోని మద్యం దుకాణాల్లో సీసాలను కొనుగోలు చేసి తరలిస్తున్నాడన్న పక్కా సమాచారంతో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏబీ చలం, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకుని సోదా చేయగా అతని వద్ద 10 క్వార్టరు సీసాలు లభించాయి. మూడు కంటే ఎక్కువ సీసాలను కలిగి ఉండకూడదన్న నిబంధనలు ఉండడంతో అతన్ని అరెస్ట్ చేశారు. నిందితుడిని బాపట్ల జిల్లా వేమూరు మండలం జంపనికి చెందిన వ్యక్తిగా గుర్తించారు.

భగత్‌సింగ్‌కు ఘననివాళి

తెనాలి: విప్లవవీరుడు భగత్‌సింగ్ జయంతి సందర్భంగా బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బుర్రిపాలెంరోడ్డులో విద్యార్థులతో కలిసి ప్రదర్శనగా శివాజీచౌక్‌కు చేరుకున్నారు. అక్కడి భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ తెనాలి కార్యదర్శి కె.సుభాష్ భగత్‌సింగ్ జీవిత విశేషాలను వివరించారు. భగత్‌సింగ్ ఆశయాలు, పోరాటపటిమను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. తెనాలి కమిటీ అధ్యక్షుడు ఎస్.ఉదయ్ ఈశ్వర్, ఉపాధ్యక్షుడు ఎ.సాత్విక్, పి.అనుదీప్, సభ్యులు కళ్యాణ్, శశికాంత్ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: కులంపేరుతో దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 159వ సచివాలయంలో కన్వీనర్‌గా పనిచేసే కృపాదానం బుధవారం శివనాగరాజు కాలనీలో ఉండగా, అదే ప్రాంతానికి చెందిన చావ వెంకటేశ్వర్లు కృపాదానం వద్దకు వచ్చాడు. తన రేషన్ కార్డు ఎందుకు రద్దు చేశావంటూ కృపాదానంను కులం పేరుతో దూషించాడు. కృపాదానం బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

- జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం
- ఇంటింటి ఆరోగ్య సర్వే పరిశీలన



వివరాలు నమోదు చేసుకుంటున్న ప్రత్యేకాధికారి సుబ్బారాయణం

తెనాలి: రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షను అంకితభావంతో చేపట్టాలని కార్యక్రమ ప్రత్యేకాధికారి/ జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం అన్నారు. బుధవారం ఆయన తెనాలిని సందర్శించారు. సర్వే జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్యక్షేమాలను తెలుసుకుని, హెమోగ్లోబిన్ పరీక్షలు చేసి వివరాలను ప్రత్యేకంగా కేటాయించిన యాప్‌లో పొందుపరచాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. నిర్దేశించిన ప్రాంతాల్లో అక్టోబరు 5వ తేదీనుంచి నిర్వహించ తలపెట్టిన ఆరోగ్య శిబిరాల్లోకి ప్రజలను తీసుకొచ్చి ఉచితంగా వైద్యచికిత్సలు చేయించాలని కోరారు. సహాయ మలేరియా అధికారి చెరసాని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా సబ్‌యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దాసరి విజయకుమారి, సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, ఏఎస్ఎం రాణి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి, వరమ్మ, ఆశా కార్యకర్త మునావత్ లీలావతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వడ్డెర కాలనీలోని అంగన్‌వాడి సెంటర్‌ను సందర్శించిన పోషకాహార మాసోత్సవాల ర్యాలీలో పాల్గొన్నారు.

ముమ్మరంగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే...

తెనాలి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పట్టణంలో ముమ్మరంగా జరుగుతోంది. సచివాలయాల వారీగా ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలోని ఇంటింటికీ వెళుతున్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు ఏరోజుకారోజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబీకులకు హెమోగ్లోబిన్, బీపీ, షుగర్ పరీక్షలను చేస్తున్నారు. ప్రభుత్వం సమకూర్చిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నమోదుచేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఎవరికైనా ఉంటే ఆ వివరాలను వారు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారు. అక్టోబరు నెల 5వ తేదీనుండి వార్డుల్లో జరగనున్న వైద్య, ఆరోగ్య శిబిరాలకు రావాలని, ఏరోజు ఎక్కడ శిబిరం జరిగేది ముందుగా సమాచారం ఇస్తామని సిబ్బంది ప్రజలకు వివరంగా చెబుతున్నారు. వైద్యశిబిరాల్లో స్పెషలిస్టు డాక్టర్లచే వైద్యపరీక్షలు చేసి, అవసరమైన చికిత్సను, అందులను ఉచితంగా అందజేస్తారని చెప్పారు. బుధవారం పట్టణంలోని గంగానమ్మపేట–1, కొత్తపేట–2, ఇందిరానగర్ యానాది కాలనీ, నాజరుపేట, బాలాజీరావుపేట సచివాలయాల పరిధిలో జరిగిన సర్వేలో ఏఎస్ఎంలు, ఆశా కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

తరచూ రక్తదానంతో గుండెజబ్బులు దూరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న చింతల శ్రీనివాస్

తెనాలి: తరచూ రక్తదానం చేస్తే గుండెజబ్బులు రావని ప్రియదర్శిని డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ చింతల శ్రీనివాస్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ సహకారంతో కాలేజీలో బుధవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్తదానంతో చెడు కొలస్ట్రాల్ విభజన జరుగుతుందన్నారు. క్యాన్సర్ కణాలు నియంత్రణలో ఉంటాయని చెప్పారు. గుండెపోటు, మెదడుపోటు వంటివి తగ్గుతాయని వివరించారు. హ్యాపీ మల్టీస్పెషాలిటీ హాస్పటల్ వైద్యనిపుణురాలు డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా రక్తదానం ఆవశ్యకతపై అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోషకాహార లోపంతో బాధపడుతున్న మహిళలకు రెడ్‌క్రాస్ ఉచిత ఆరోగ్య శిబిరాల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఈ శిబిరంలో విద్యార్థులతోపాటు డాక్టర్ మహేష్, ఆయన సోదరుడు ప్రదీప్‌లు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు

తాడికొండ: పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తాడికొండ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బండ్లమూడి మరియదాసు అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక ధారుఢ్యం పెంపొందించడంతో పాటు మానసిక ఆందోళనను తగ్గించవచ్చనే యోచనతో ప్రభుత్వం ప్రతి పాఠశాలలో చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత నిచ్చి నో బ్యాగ్ డేను అమలు చేస్తుందని చెప్పారు.
పోటీలను సమర్థంగా నిర్వహించిన పీఈటీ ఎ.సతీష్, వి ప్రశాంత్‌లను అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో అండర్–17 విభాగంలో జావలిన్ త్రో డి.అనీల్ కుమార్ ప్రథమ స్థానంలో నిలువగా షటిల్ బ్యాడ్మింటన్‌లో డీఈఎస్ మణికంఠ, కబడ్డీ కె.దినేష్ కార్తీక్ రామ్, వాలీబాల్ డీఈఎస్ మణికంఠ, త్రోబాల్ డి.అనీల్ కుమార్, వై. ప్రసన్న కుమార్, డీఈఎస్ మణికంఠ, ఖోఖో కె.పవన్ ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో కబడ్డీ బి.అభిషేక్, వాలీబాల్ ఎం.మధుబాబు, కె.ప్రసన్న, ఖోఖో హేమంత్, సాయి నాయక్‌లు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి శేఖర్ బాబు, సూపరింటెండెంట్ కె.రవి, వందనం అభినందించారు.

సంచార జాతుల వెతలకు చెక్

మొండిబండ సంఘం జిల్లా అధ్యక్షుడు రాధారావు



తెనాలిటౌన్: రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారు ఎన్నో ఏళ్లుగా పడుతున్న ఇబ్బందులకు చెక్ పెట్టేవిధంగా రిజిస్టర్ కాని స్థలాలు రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పాస్ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వెనుకబడిన తరగతులవారు సదా రుణపడి ఉంటారని మొండిబండ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాదం రాధారావు తెలిపారు. రూరల్ మండలం కొలకలూరులో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సంచార జాతులు 36 కులాల్లో ఉన్నారని, వీరు ఒకచోట స్థిరంగా ఉండరని తెలిపారు. వీరిలో చాలా మంది స్థలాలు రిజిస్టర్ చేసుకోలేదన్నారు. తాజాగా బిల్లుతో వీరి వెతలకు సీఎం వైఎస్ జగన్ చెక్ పెట్టారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో సంచార జాతుల పిల్లలకు విద్యను అందిస్తూ అన్ని వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రికి వీరంతా ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా సంచారజాతుల పిల్లలకు కుల, ఆదాయ, నివాస సర్టిఫికెట్లు అందజేశారని రాధారావు చెప్పారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువతి మృతి



మంగళగిరి: భర్త వేధింపులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని కురగల్లు గ్రామంలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన బత్తుల గౌతమి(26) యర్రబాలేనికి చెందిన దానబోయిన హరికృష్ణతో నాలుగేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఈ నెల 15వ తేదీన కురగల్లులోని తమ పుట్టింటికి వెళ్లింది. భర్త హరికృష్ణ, కుటుంబ సభ్యులు పంచాయతీ పేరుతో బస్టాండ్ సెంటర్‌లో గౌతమిని ఆమె కుటుంబ సభ్యులను అవమానపరచేలా వ్యవహరించారు. దీంతో మనస్తాపానికి గురయిన గౌతమి ఈనెల 21వ తేదీన పుట్టింటి వద్ద పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందింది. అంతకు నాలుగు రోజుల ముందు గౌతమి తన ఆత్మహత్యకు భర్త వేధింపులే కారణమని సెల్ఫీ వీడియో తీసుకుంది. గౌతమి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి నాగరాజా

మంగళగిరి: పర్యావరణ పరిరక్షణపై ప్రతి పౌరుడికి అవగాహన అవసరమని మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై.నాగరాజా అన్నారు. పట్టణంలో కోర్టు ఆవరణలో బుధవారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్జి నాగరాజా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ముఖ్యమని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్‌వీ రామకృష్ణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణంలో సమతుల్యత దెబ్బతింటుందని హెచ్చరించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వి.శ్రీప్రత్యూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరి ఆరోగ్యాలు బాగుంటాయన్నారు. కోర్టు ప్రాంగణాన్ని ఎల్లప్పుడూ శుభ్రతగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జె.లెనిన్‌బాబు, బి.నాయుడమ్మ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

రూ.22 లక్షలతో చేపట్టే పనులకు శ్రీకారం



అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల ఏర్పాటుకు పూజ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అగ్ని ప్రమాదాలను నివారించేందుకు భద్రత చర్యలను చేపట్టినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. బుధవారం డాక్టర్ పొదిల ప్రసాద్ బ్లాక్ లోని అండర్ గ్రౌండ్‌లో రూ. 22 లక్షలతో అగ్ని ప్రమాదాల నివారణ కోసం చేయనున్న పనులకు పూజలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు అగ్ని భద్రత పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రమాదాలను తగ్గించడానికి మరమ్మతులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, ఎలక్ట్రికల్ ఏఈ దస్తగిరి, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్, ఇంజినీరింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు అవయవదానంపై ర్యాలీ

గుంటూరు జీజీహెచ్‌లో గురువారం ఉదయం 8 గంటలకు అవయవ దానం, ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అవయవ ప్రతిజ్ఞతో పాటు పేర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

దాతల వితరణ

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధి కోసం దాతలు ముందుకు రావడం అభినందనీయమని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. నాదెండ్ల రాంబాబు, కుమార్తె వైష్ణవిలు ప్లాస్టిక్ బెడ్స్ కాక్ ట్యాప్‌లు సూపరింటెండెంట్‌కు బుధవారం అందచేశారు. ఆసుపత్రిలో జరుగుతున్న అభివృద్ధి పనులకు తమ వంతు సహకారంగా దాతలు ఈ ట్యాప్‌లను అందచేశారని డాక్టర్ కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన సదస్సులో ముమ్మనేని భానుమతి

తెనాలి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కాలేజీలో బుధవారం సాయంత్రం రక్తదానం ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రక్తదానం చేయటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని, ఆపదలో ఉన్నవారికి రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. రెడ్‌క్రాస్, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి, మేనేజింగ్ కమిటీ సభ్యురాలు డాక్టర్ పావని ప్రియాంక, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, జిల్లా ఫీల్డ్ ఆఫీసర్ షేక్ జానిరసూల్, వైష్ణవి కాలేజీ ప్రిన్సిపాల్ పాటిబండ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సమగ్ర సర్వేకు సహకరించండి

ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ప్రభాకరరెడ్డి

తెనాలి: ఓటర్ల జాబితా ప్రత్యేక సమ్మరీ రివిజనులో భాగంగా ఇంటింటి సమగ్ర సర్వే జరుగుతోందని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీల నాయకులు తగిన విధంగా సహకారం అందించాలని కోరారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధులతో గుంటూరు ఆర్డీఓ, తెనాలి ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ ఎం.ప్రభాకరరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వేపై మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకని ఎన్నికల కమిషన్ ప్రత్యేక రివిజను జరుపుతున్నట్టు చెప్పారు. ఓటర్ల జాబితా సర్వేలో ఇప్పటివరకు వచ్చిన ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను వారికి వివరించారు. సందేహాలుంటే తెలియజేయమని కోరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తాడిబోయిన రామయ్య, టీడీపీ ప్రతినిధి కేసన కోటేశ్వరరావు, కాంగ్రెస్ ప్రతినిధి పొన్నూరు నాగసూర్య శశిధరరావు, సీపీఎం నేత కొల్లిపర బాబుప్రసాద్‌లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. పలు సూచనలు చేశారు.

కాళికా వేషధారణలో తిరుగులేని నటుడు ప్రభాకర్

సంతాపసభలో దర్శకుడు దిలీప్‌రాజా



ప్రభాకర్ చిత్రపటం వద్ద కళాకారుల నివాళి

తెనాలి: కాళికా వేషధారణతో సాటిలేని కళాకారుడిగా రాణించిన గోనుగుంట్ల ప్రభాకర్ మరణం కళారంగానికి తీరని లోటుగా సినీదర్శకుడు, మా–ఏపీ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా అన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీసీ కాలనీలోని సంఘ భవనంలో ఏర్పాటైన ప్రముఖ కళాకారుడు గోనుగుంట్ల ప్రభాకర్ సంతాపసభకు ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షత వహించారు. ప్రభాకర్ స్మారకార్థం ఏటా ఏకపాత్ర పోటీలను నిర్వహించాలని సూచించారు. పలువురు కళాకారులు తమ ప్రసంగాల్లో ప్రభాకర్ కళావైదుష్యాన్ని స్మరించుకున్నారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సినీ, రంగస్థల నటుడు వేమూరి విజయభాస్కర్, కనపర్తి బాబూరావు, బడుగు మోహన్‌రావు, చిట్టూరి సీతారామయ్య, ఆర్అండ్‌బీ రాజు, కన్నెగంటి మధు, దేవిశెట్టి కృష్ణారావు, ఎం.రామలింగేశ్వరరావు, పాతూరి సుబ్రహ్మణ్య కవి తదితరులు మాట్లాడారు.

కులవివక్షను చీల్చిచెండాడిన జాషువా



గుర్రం జాషువా చిత్రపటం వద్ద నివాళి

తెనాలి: ప్రఖ్యాత కవి గుర్రం జాషువా జయంతిని బుధవారం స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. కులనిర్మూలన పోరాట సమితి తెనాలి అధ్యక్షుడు పి.జోనేష్ అధ్యక్షత వహించారు. సీపీఎం తెనాలి కమిటీ కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ గుర్రం జాషువా తన కాలంలో ఉన్న సాంఘిక దురాచారాలను మొక్కవోని దీక్షతో ఢీకొన్న ధీశాలిగా చెప్పారు. పీడిత, శ్రామిక జనోద్ధరణ కోసం కలం కంకణం కట్టుకున్నారని చెబుతూ మానవ కల్యాణానికి మించినది మరొకటి లేదని చాటినట్టు చెప్పారు. పేదరికం, కులవివక్ష తనకు ఎన్నో పాఠాలు నేర్పినట్టు జాషువానే చెప్పుకున్నట్టు గుర్తుచేశారు. దరిద్రాన్ని, కులవివక్షను చీల్చిచెండాడాలని, ఎవరికివారు మనిషిగా నిరూపించుకోవాలని జాషువా బోధించినట్టు వివరించారు. జుజ్జవరపు న్యూటన్, దేవరకొండ శంకరరావు, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, కె.రవికుమార్, గరిక శ్రీనివాసరావు, మంగళగిరి వెంకటేశ్వర్లు, దార్ల పద్మ తదితరులు పాల్గొన్నారు. తొలుత జాషువా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

గాంధీ జయంతి వారోత్సవాలు ప్రారంభం



హారతినిస్తున్న రామలింగాచారి దంపతులు

తెనాలి: మహాత్మాగాంధీ జయంతి వారోత్సవాలను బుధవారం ఇక్కడి బుర్రిపాలెంరోడ్డులోని శ్రీమహాత్మా సేవాశాంతి ఆశ్రమంలో ప్రారంభించారు. గాంధీజీ, కస్తూర్బా గాంధీ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా అష్టోత్తర శతనామార్చన పూజాదికాలు కూడా చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఆశ్రమ నిర్వాహకుడు వజ్రాల రామలింగాచారి మాట్లాడుతూ, ప్రపంచ శాంతిని కోరుకున్న అహింసామూర్తి మహాత్మాగాంధీజీని నిత్యం ప్రార్థన చేసినట్టయితే శాంతి వర్ధిల్లుతుందనేది తన విశ్వాసంగా చెప్పారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా కూడా గాంధీజీ మార్గమే సేవామార్గమని చెప్పారని గుర్తుచేసుకున్నారు. సాయి భక్తుడు సంకా ఉదయశంకర్ మాట్లాడుతూ అందరికీ సేవచేయండి... ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దన్న విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఆశ్రమవాసులు, సాయిబాబా భక్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్

తాడికొండ: బాల్య వివాహాలపై అవగాహన కలిగి ఉండాలని మండల ప్రత్యేకాధికారి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, క్రాఫ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు నిర్ణీత వయసు రాకుండా వివాహాలు జరిపించడం ద్వారా పుట్టబోయే బిడ్డ లోపాలతో జన్మించడం, తగిన సామర్థ్యం లేని కారణంగా తల్లికి, బిడ్డకి ప్రాణహాని పొంచి ఉందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన వయసు కంటే ముందుగా చిన్నారులకు వివాహం జరిపిస్తే అనర్థాలు వాటికి పడే శిక్షలు వివరించారు. ఎంపీడీఓ అత్తోట దీప్తి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు వివాహ నమోదు ప్రక్రియ, గ్రామ/వార్డు స్థాయి బాల్య వివాహ నిషేధిత పర్యవేక్షణ కమిటీలు తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహార పదార్థాలను తయారు చేసిన స్టాల్ ను సందర్శించి పలువురిని అభినందించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్, ఎంఈఓ తెనాలి ఇందిర, ఏపీఎం సాంబశివరావు, డీసీపీఓ దుర్గా భవాని, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.విజయ్ కుమార్, లీగల్ ఆఫీస్ కౌన్సిలర్ బి.వాసంతి, క్రాఫ్ కో ఆర్డినేటర్ వెంకట్ పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం



తాడికొండ: అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న లారీని ఎస్ఈబీ అధికారులు బుధవారం సీజ్ చేశారు. ఎస్ఈబీ సీఐ మారయ్య బాబు అందించిన వివరాలు.. తాడికొండ మండలం కంతేరు గ్రామంలో ఇసుక తరలిస్తున్న లారీని తనిఖీ చేయగా 30 టన్నుల అక్రమ ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఇసుక లారీతో పాటు తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామానికి చెందిన డ్రైవర్ డి.నాగరాజును అదుపులోకి తీసుకొని తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు చెప్పారు.